# నా దేశాన్ని చూస్తూ...!

- అల్లెన వెంకట జనార్ధనరావు.

అవి నేను విజయనగరంలో ఉద్యోగం చేస్తున్న రోజులు. అర్జెంటు ఆఫీసు పనిమీద వెళ్లవలసి వచ్చిందొకసారి- హైదరాబాదుకు. విశాఖపట్నం జోనల్ ఆఫీసు నుండి తీసుకోవలసి వుంది- కొంత సమాచారం.

విశాఖపట్నం వెళ్లడానికి బస్‌స్టేషనుకు వెళ్లాను- ఆటోకు డబ్బులిచ్చి కాంప్లెక్స్‌లోకి నడిచాను- బ్రీఫ్‌కేస్‌తో సహా.

అక్కడొక దృశ్యం- ఒక ముసలావిడ - నడుము కొంచెం వంగింది - చూపులు దీనంగా ఉన్నాయి - ఆమె చేతులలో ఒక పసికందు - ఇంకా నెలలైనా నిండినట్టు లేదు - పొత్తిళ్లలో పసిబిడ్డను పట్టుకుని అడుక్కుంటున్నది- ప్రతివారి దగ్గరికెళ్లి.

'బాబూ! వీడు నా కూతురు బిడ్డ. పురిటిలోనే వీడి తల్లి చచ్చిపోయింది. పాలు పోయడానికి కూడా డబ్బులు లేవు. కనికరించి ధర్మం చేయండి బాబూ...!' హృదయ విదారకంగా వున్నది- ముసలావిడ గొంతు.

ఆ పసికందును చూసి, ముసలావిడ దీనాలాపాలు విని తోచినది ఇస్తున్నారు- కొంతమంది ప్రయాణీకులు. నేను కూడా వేశాను- రెండు రూపాయల బిళ్ల.

ఇంతలో సుడిగాలిలా వచ్చిందొకావిడ. వస్తూనే ముసలావిడ చేతుల నుండి లాగేసుకుంది- పసిబిడ్డను.

'ఏమే...! ముసలిముండ...! ఎంత సేపుంచుకుంటావే నా కొడుకును. సంపాదించింది చాలలేదేంటే'- రంకె వేసింది.

'ఏందోలమ్మ... అద్దె కట్టిన కదే. ఉత్తినే కొడుకునిచ్చినట్టు అలా పేలిపోతున్నావు'- తిరగబడింది ముసలావిడ.

'పన్నెండు గంటల వరకని చెప్పి... ఇప్పుడు టయిమెంతయిందే... పూట గడవక ఈ పాపిష్టి పనికి వప్పుకున్నాను గానీ... ఇంకో పది రూపాయలు ఇవ్వకపోతే నేనొల్లకోను' అరిచింది రెండో ఆవిడ.

'నాకూ పూట గడవకేనే... నీ కొడుకును అద్దెకు తీసుకున్నాను' అంటోంది ముసలావిడ.

ఇంతలో విశాఖపట్నం నాన్‌స్టాప్ బస్సు వచ్చి ఆగింది- ప్లాట్‌ఫారం మీద.

గబగబా వెళ్లి టికెట్ కొని బస్సులో కూచున్నాను- నా సీటులో.

- - - - -

బయలుదేరింది- బస్సు.

దాటింది- తగరపువలస.

ఆనందపురం జంక్షన్‌కు కొద్ది దూరంలో ఆగిపోయింది. చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కన పెట్టి ఏమయిందోనని చూస్తున్నాను.

ఇంజన్ బోయ్‌నెట్ ఎత్తి పరిశీలించాడు డ్రైవర్. 'ఇంజన్ చెడిపోయింది. ఇంకొక బస్సు వస్తే అందులోకెక్కిస్తాను'- చెప్పాడు డ్రైవర్.

అందరూ బస్సు దిగి నిల్చున్నారు- రోడ్డు పక్కన. మార్చి ఎండ మండిపోతోంది. కొద్ది దూరంలో వుంది- కొబ్బరి బోండాల దుకాణం. అక్కడికి కొంతమంది వెళ్లి బోండాలు తాగుతున్నారు- ఎండకు తాళలేక.

నేను కూడా దుకాణం వద్దకు వెళ్లి తీసుకున్నాను- ఒక కొబ్బరి బోండా.

ఇంతలో నా దాపులనే ఆగిందో 'ఇండికా' కారు. దర్జా అయిన బట్టలలో ఒకతను కూర్చుని వున్నాడు- స్టీరింగ్ వద్ద. కారు దిగుతుండగానే ఆర్డరిచ్చాడు- ఒక బోండా ఇమ్మని. దుకాణదారు బోండా కొట్టి పంపాడు కుర్రాడితో- స్ట్రాతో సహా.


బోండా త్రాగి డబ్బులిచ్చాడు- కుర్రాడికి.

లిఫ్టు దొరుకుతుందేమో ప్రయత్నిద్దామని వెళ్లాను కారు వద్దకు.

'వైజాగ్- లిఫ్టు కావాలి'

ఎగాదిగా చూశాడు నావంక. ఏమనుకున్నాడో... సైడు డోరు తీసి కనుసైగ చేశాడు- ఎక్కమని.

థాంక్స్ చెప్పి వెళ్లి కూర్చున్నాను- అతని పక్క సీటులో.



కారు స్లో చేసి, సెల్ చెవి వద్ద పెట్టి 'హలో...'

'... ... ... ...'

'ఆc ఆc- హైదరాబాదు నుండా...'

'... ... ... ...'

'నీ ఫోను కోసమే ఎదురుచూస్తున్నాను'

'... ... ... ...'

'పుస్తకాలు రెడీగా వున్నాయి. ఎప్పుడు పంపాలి?'

'... ... ... ...'

'ఆc. న్యూ రిలీజ్‌యే. అయితే మన రావుతో పంపుతాను. ఈరోజు గోదావరికే. వైజాగ్‌లో సాయంకాలం 5 గంటలకు బయలుదేరుతుంది.'

'ఓకే. చదివేశాక పంపించెయ్... వుంటా'

సంభాషణ ముగిసింది. కారు మద్దిలపాలెం జంక్షన్ దగ్గర ఆగింది- సిగ్నల్ కోసం.

అతనికి మరొకమారు థాంక్స్ చెప్పి దిగిపోయాను- అక్కడికి మా జోనల్ ఆఫీసు దగ్గరవడం వల్ల.

కారు కదిలింది. మధురవాడ పొలిమేర దాటుతోంది. అతను ఏమీ మాట్లాడలేదు. నేనే మాట కలిపాను. 'ఏం చేస్తుంటారు- సార్?'

'బిజినెస్' ముక్తసరి జవాబు.

'రియల్ ఎస్టేటా?'

'కాదు. ఇంపోర్టు అండ్ ఎక్స్‌పోర్టు.'

'విజయనగరంలోనా?'

'కాదు. హెడ్డాఫీసు విశాఖపట్నం.'

'ఓహో... బిగ్ షాట్‌లా వున్నాడు' అనుకున్నాను.

ఇంతలో 'కిర్‌ర్...కిర్‌ర్...' శబ్దం.

- - - - -

జోనల్ ఆఫీసులో సమాచారం తీసుకోవడం

బాగా ఆలస్యమైంది. చీకటి పడింది. దసపల్లాలో భోజనం చేసి రైల్వేస్టేషన్ చేరుకున్నాను. రాత్రి 11 గంటలు. ప్లాట్‌ఫారం కిక్కిరిసి వుంది- ప్రయాణీకులతో. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఒక గంట లేటు. ఒక మూల బెంచిమీద కూర్చున్నాను. మసక వెలుతురులో చేతనున్న పుస్తకాన్ని తిరగేస్తున్నాను- ఏమీ తోచక. సమీపంలో పసిబిడ్డ రోదన. ఎండిపోయిన స్తనంలో పాలులేక- పిచ్చితల్లి ఆవేదన. ఏ చీకటి తప్పు ఫలితమో- రూపుదాల్చి ఏడుస్తోంది. పసిపిల్ల ఏడుపు అంతకంతకూ ఎక్కువవుతోంది.

తల్లి ఆవేదన చూస్తే- పాలు కొనడానికి కూడా పైసలు లేనట్లుంది.

పావుగంట గడిచింది. పసిపిల్ల ఏడుపు ఆగలేదు. ఏదో నిర్ణయించుకున్నట్లుందా పిచ్చితల్లి.

ఆ పక్కగా మసక చీకట్లో తచ్చాడుతున్నాడో- మగరాయుడు.

తెగించి లేచింది. మగరాయుడి వద్దకు వెళ్లి చెయ్యి చాపింది. అతనేదో చెప్పాడు. అటు పక్కకు నడిచాడు. అనుసరించింది- పిచ్చితల్లి.

పుస్తక పఠనంలో పడ్డాను- నేను.

ఇంతలో కర్ణకఠోరమైన గొంతు.

బూతులు తిడుతూ- లాఠీ ఝుళిపిస్తూ.

ఆమెను అదిలిస్తూ- వచ్చాడు రక్షకభటుడు.

'దొంగ నా కొడుకు- పారిపోయాడు. నడవే లం... పోలీస్‌స్టేషన్‌కు' రంకె వేస్తున్నాడు పోలీసు.

'అన్నా- నా బిడ్డ పాలులేక ఏడుస్తోంది. దానికి పాలు కొనడానికి పాడు పనికి వప్పుకున్నాను. నన్ను వదిలేయి- అన్నా! నీ కాలు మొక్కుతా' వేడుకొంటుందా తల్లి.

'ప్లాటుఫారం మీద కూడా వ్యభిచారమే- వ్యాపారమైపోయింది'- ఎవరో కామెంటు.

ఇంతలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ పెనుభూతంలా అరుస్తూ ప్లాటుఫారం మీదికి వచ్చి ఆగింది.

నా రిజర్వు కంపార్టుమెంటు వెదుక్కుంటూ కదిలాను నేనక్కడినుండి.

\- - - - -

కంపార్టుమెంటులోకి వెళ్లి నా బెర్తు మీద బ్రీఫ్‌కేసు తలగడగా పడుకున్నాను. ట్రైన్ బయలుదేరింది. ఎపుడు నిద్రపట్టిందో- మెలకువ వచ్చి చూసేసరికి ఏదో స్టేషనులో ఆగివుంది. తెల్లవారిపోయింది. టీ, కాఫీలు అమ్మేవారి కేకలు. మా కంపార్టుమెంటు దగ్గర ఒక కుర్రాడు వార్తాపత్రికలు అమ్ముతున్నాడు. ఒక తెలుగు పేపరు కొని హెడ్ లైన్స్ చూస్తున్నాను. బాక్సు కట్టిన వార్తపై పడింది- నా దృష్టి. 'ఇంపోర్టు అండ్ ఎక్స్‌పోర్టు బిజినెస్ ముసుగులో అమ్మాయిల వ్యాపారం. ముఠా నాయకుని అరెస్టు.' ఫొటో చూసి 'స్టన్ను' అయ్యాను. అతను ఎవరో కాదు. నాకు ఆనందపురం జంక్షన్ నుండి కారులో లిఫ్టు ఇచ్చిన పెద్దమనిషి.

మరి సమాజంలో శాంతి ఎలా ఉంటుంది...?! ○

## పాట వాసన

ఒక చెమట చుక్క
గుప్పెడు మెతుకు లైన వైనం
మనిషి లోపల యంత్రాలు ముక్కలై
ఒక వస్తువు తయారైన వైనం
ఎప్పుడైనా ఆలోచించావా?
లోపలికి వెళుతున్న నాలుగు వేళ్ళూ
నాగలి చప్పుళ్ళు చేయడం గమనించావా?
తారురోడ్డు మీద జారిపోతున్న కారు
ఎవరి జీవన స్వేదం మీదుగా
ప్రయాణిస్తుందో ఆచూకీ తీసావా?
ఈ ప్రశ్నలన్నీ నీ మీద సంధించే ముందు
నన్ను నేను ప్రశ్నించుకున్నప్పుడు
కట్టుకున్న బట్టలూ -
వేసుకున్న చెప్పులూ --
చెప్పుకుంటున్న గొప్పలూ ---
కలవరపెట్టక మానవు.
అందుకే
నేను గళం విప్పి గీతం పాడినా
గాన మాధుర్యంతో పాటు
చెమట వాసన వెయ్యక తప్పదు

\- పి. ఆర్. ఎల్. స్వామి